## క్లుప్తంగా

### రూ.50 లక్షలతో మంచినీటి పైప్‌లైన్‌కు శంకుస్థాపన

**పెనమలూరు:** గోసాల గ్రామంలో రూ.50 లక్షలతో మంచినీటి పైప్‌లైన్‌కు గ్రామ సర్పంచి సంగెపు శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ గోసాల గ్రామ పరిధి వైకుంఠపురం, వేణుగోపాలస్వామినగర్, దళితవాడ ప్రాంతాల్లో నాణ్యమైన తాగునీరు అందించటానికి రూ.50 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణం చేపట్టామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందన్నారు. కార్యక్రమంలో స్థానికులు వేమూరి సత్యనారాయణ, కోటి, వెంకటేష్, షేక్ బాజి, జోజి, సింగవరపు మురళి, వెంకటరమణ పాల్గొన్నారు.

### బాక్సింగ్‌లో రాణికి రజత పతకం



**ఉయ్యూరు:** బాక్సింగ్‌లో ఉయ్యూరుకు చెందిన ఎం.సుప్రజారాణి రాష్ట్రస్థాయిలో రజత పతకాన్ని సాధించింది. ఇటీవల విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో బాలికల అండర్-17 విభాగంలో 60-63 కేజీల కేటగిరీలో సుప్రజారాణి సత్తా చాటి సిల్వర్ మెడల్‌ను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా సుప్రజారాణిని బాక్సింగ్ యూనియన్ జిల్లా కార్యదర్శి వైవీఎస్ ఉమామహేశ్వరరావు, కోచ్ సూరి అభినందించారు.

### నేడు పోరంకి సెక్షన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పెనమలూరు:** నేడు పోరంకి సెక్షన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు అన్నారు. ఆయన గురువారం వివరాలు తెలుపుతూ శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోరంకి సెక్షన్‌లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. ఈ కారణంగా బందరు రోడ్డు, శ్రీనివాస నగర్ కాలనీ, సీతాపురం కాలనీ, కృష్ణవేణి స్కూల్ రోడ్డు, జాబిల్లి ఆస్పత్రి, బీఎస్ఎన్ఎల్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

### ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహం

**గన్నవరం:** ప్రతిభావంతులైన క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎంపీపీ అనగాని రవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన క్రీడాకారిణి దాసరి మాన్యను ఎంపీపీ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల విజయనగరంలో జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మాన్య పసిడి పతకం సాధించడం ప్రశంసనీయమన్నారు. జాతీయ స్థాయిలో కూడా రాణించా లని ఆకాంక్షించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ నెల 26 నుంచి గ్రామ సచివాలయ స్థాయి నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, గోపవరపుగూడెం సర్పంచ్ నల్లూరి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ సత్యకుమార్, కోచ్ దనియాల నాగరాజు పాల్గొన్నారు.

# పెదపులిపాకలో శరవేగంగా అభివృద్ధి

**రూ.2.20 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం**

**పెనమలూరు:** పెదపులిపాక గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామంలో రూ.2.20 కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పెదపులిపాక గ్రామం ఇటీవల కాలంలో రియల్ రంగంలో ముందంజలో ఉంది. స్థిర నివాసాలు ఇక్కడ ఎక్కువగా నిర్మాణం చేస్తుండటంతో నివాసితులకు కనీస మౌలిక వసతులు కల్పించే దిశలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరి ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గ్రామంలో ప్రస్తుతం రూ.2.20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ నిధుల్లో గ్రామ పంచాయతీ నిధులు రూ.1.05 కోట్లు, మండల పరిషత్ నిధులు రూ.85 లక్షలు, జిల్లా పరిషత్ నిధులు రూ.20 లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలు ఉన్నాయి.

**చేపట్టిన అభివృద్ధి పనులు ఇవే...**

- పెదపులిపాక గ్రామంలో మొత్తం 15 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అందులో ఎన్టీఆర్ విగ్రహం నుంచి రామాలయం వరకు రూ.20 లక్షలతో 110 మీటర్లు సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణం చేశారు.
- ఎస్సీ కాలనీలో మండల పాఠశాల ఎదుట రూ.5 లక్షలతో 90 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం.
- ఎస్సీ కాలనీలో చర్చి వద్ద రూ.3 లక్షలతో 45 మీటర్ల సీసీ రోడ్డు.

ఇదే కాలనీలో వల్లూరి మోహన్ ఇంటి వద్ద నుంచి రూ.2.5 లక్షలతో 45 మీటర్ల సీసీ రోడ్డు.

- అన్నే రవీంద్రకుమార్ ఇంటి వద్ద నుంచి రూ.16 లక్షలతో 115 మీటర్ల సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణం.
- సుబ్బారావు ఇంటి వద్ద నుంచి మసీదు రోడ్డు రూ.16 లక్షలతో 150 మీటర్ల సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం.
- గంగానమ్మ గుడి బజారులో రూ.8 లక్షలతో 80 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం.



గ్రామంలో నిర్మాణం చేసిన సిమెంట్ రోడ్డు

**సకాలంలో పనులు పూర్తి చేస్తాం**



గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేస్తాం. ఇప్పటికే పలు రహదారులు, డ్రైనేజీల నిర్మాణం పూర్తి చేశాం. మిగతా పనులు కూడా వచ్చే నాలుగు నెలల్లో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం, ఎమ్మెల్యే పార్థసారథి గ్రామానికి పుష్కలంగా నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు.

–గుంటూరు శ్రీనివాసచౌదరి, సర్పంచి, పెదపులిపాక

- ఎంవీఆర్ నగర్, గణపతినగర్‌లో రూ.32 లక్షలతో రబ్బిష్ రోడ్డు నిర్మాణం.
- గణపతినగర్‌లో రూ.20 లక్షలతో 350 మీటర్ల 1, 3 రబ్బిష్ రోడ్లు నిర్మాణం.
- సాయినగర్‌రోడ్డు రూ.25 లక్షలతో రబ్బిష్ రోడ్డు నిర్మాణం. ఎన్టీఆర్ నగర్‌లో రూ.28లక్షలతో సీసీ రోడ్డు, రబ్బిష్ రోడ్ల నిర్మాణం.
- శ్రీనగర్ కాలనీలో రూ.25 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంకు నిర్మాణం.
- శ్రీనగర్ కాలనీలో రూ.10 లక్షలతో 200 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణం.
- ఎస్సీ కాలనీ వద్ద మెయిన్ డ్రైన్ నిర్మాణానికి రూ.5 లక్షలు. కల్వర్టు నిర్మాణానికి రూ.2 లక్షలు.

# సీఎం జగన్‌తోనే సుభిక్ష పాలన



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సువర్ణరాజు, నాయకులు

**పి.నైనవరం(విజయవాడరూరల్):** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుభిక్ష పాలన సాధ్యమని రూరల్ మండల జెడ్పీటీసీ కె.సువర్ణరాజు అన్నారు. పి.నైనవరం గ్రామ సచివాలయం వద్ద గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కన్వీనర్ దావు వెంకటేశ్వరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జెడ్పీటీసీ సువర్ణరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధి జరగాలంటే జగనన్నతోనే జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. పి.నైనవరం సచివాలయ పరిధిలో 25 కోట్ల 66 లక్షల రూపాయల లబ్ధి గ్రామస్తులకు జరిగిందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్వీఆర్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు జరిగాయన్నారు. మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ శీలం రంగారావు మాట్లాడుతూ కపట మాటలు చెప్పేవారిని నమ్మవద్దని, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర భవిష్యత్ బాగుంటుందన్నారు. ప్రతి గ్రామంలో కోట్లాది రూపాయల లబ్ధి చేకూరుతుందని ఈ అభివృద్ధి టీడీపీ పాలనలో ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ సాదం వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచి బట్టా సోమయ్య, ఉప సర్పంచి శ్రీనివాసరావు, ఆర్బీకే చైర్మన్ నాగేశ్వరరావు, మండల ముస్లిం మైనార్టీ కన్వీనర్ షేక్ హుస్సేన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు.

**ప్రతి గడపకు సంక్షేమం వైఎస్సార్‌సీపీ ఘనత**

**గన్నవరంరూరల్:** మండలంలోని సూరంపల్లి గ్రామంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. స్థానిక పంచాయతీ కార్యాలయం సంక్షేమ పథకాల బోర్డును ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ఏపీని దేశంలోనే అగ్రస్థానంలో ఉంచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని చెప్పారు. విద్యా, వైద్య రంగాల్లో మార్పులను తేవటంతో పాటు, ఉద్యోగాలు అందించి, ఆ సేవలను ప్రజలకు అంకితం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి గడపకు సంక్షేమాన్ని, అభివృద్ధిని అందించిన వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలన్నారు. ఈవోపీఆర్డీ వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి కోట సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కందిమళ్ళ రాఘవ, గ్రామస్తులు, సచివాలయం, బూత్ కన్వీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# పంట నష్టం అంచనాల నమోదు పరిశీలన



కాకులపాడులో పంట నష్టం అంచనాలను పరిశీలిస్తున్న ఏవో భవాని, అధికారులు

**హనుమాన్‌జంక్షన్ రూరల్:** మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న పంట నష్టం అంచనాలను రూపొందించేందుకు క్షేత్రస్థాయిలో అధికార బృందాలు పర్యటిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో వీఆర్వో, వీఏఏలు ప్రతి రైతు పొలాన్ని పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు. బాపులపాడు మండలంలోని కాకులపాడు, రామన్నగూడెం, వేలేరులో జరుగుతున్న పంట నష్టం అంచనాలను ఏవో జొన్నలగడ్డ భవాని పరిశీలించారు. రైతులు మొలకెత్తిన, రంగు మారిన ధాన్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆమె మాట్లాడుతూ మొలకెత్తిన, రంగు మారిన ధాన్యం నమూనాలను పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ కార్యాలయానికి పంపుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే 23 వరి ధాన్యం నమూనాలను పంపినట్లు తెలిపారు. ఎఫ్‌సీఐ అధికారుల బృందం కూడా ఈ నమూనాలను పరీక్షించి ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నట్లు ఏవో భవాని తెలిపారు. ఈ నివేదికల ఆధారంగా రంగు మారిన ధాన్యం కొనుగోలు చేపడతామని రైతులకు వివరించారు. వరి పంటకు ప్రభుత్వం ఇప్పటికే హెక్టారుకు రూ.17 వేలు, మొక్కజొన్న పంటకు రూ.12,500 ఇన్‌పుట్ సబ్సిడీ ప్రకటించినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి అనుమానాలు ఉన్నా ఆర్బీకేలలో సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# రేపు బాలోత్సవం ద్వితీయ పిల్లల పండుగ



బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

**గన్నవరం:** స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 16న జరిగే బాలోత్సవం ద్వితీయ పిల్లల పండుగను విజయవంతం చేయాలని నిర్వహణ కమిటీ అధ్యక్షుడు బొడ్డు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం బాలోత్సవం పోస్టర్‌ను కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు గన్నె వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల అభిరుచులు, ఆసక్తికి అనుగుణంగా జ్ఞానతృష్ణను, సృజనను ప్రోత్సహించేందుకు, సామాజిక చైతన్యం పెంపొందించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన రెండు వేల మంది విద్యార్థులు బాలోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. ఎంట్రీ ఫారమ్స్ సమర్పించిన పాఠశాలల విద్యార్థులు శనివారం ఉదయం 9 గంటలకు ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు.

# 15వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం

**ఉంగుటూరు:** మండలంలో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో సుమారు 15వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని మండల వ్యవసాయ అధికారి వి.హరీష్ కుమార్ తెలిపారు. నందమూరు గ్రామంలో వరి పంట పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 25వేల ఎకరాల్లో వరి సాగు చేయగా తుఫాన్ కారణంగా 15వేల ఎకరాల్లో వరి పంట నష్టం జరిగిందని చెప్పారు. పలువురు రైతులతో మాట్లాడి సూచనలు చేశారు. ఇంకా ఎవరైనా రైతులు ఉంటే రైతు భరోసా కేంద్రాల్లో తెలియజేయాలని సూచించారు. రైతులకు అన్ని వేళల్లో ఆర్బీకే సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవో దుర్గా నాగేశ్వరరావు, వీఏఏలు పాల్గొన్నారు.

## పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**హనుమాన్‌జంక్షన్‌రూరల్:** పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగుతుందని జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవిర్నేని శేషగిరిరావు అన్నారు. బాపులపాడు మండలం రేమల్లెలో గ్రామ సచివాలయం ప్రాంగణంలో గురువారం 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. సర్పంచ్ చౌటపల్లి భారతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శేషగిరిరావు మాట్లాడుతూ రేమల్లెలో గడిచిన నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా వివిధ పథకాల లబ్ధిదారులకు రూ.12.79 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా మరో రూ.6.96 కోట్ల మేర నగదు పంపిణీ జరిగిందని వివరించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. తర్వాత ప్రజాప్రతినిధులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీటీసీ సభ్యులు కొలకలూరి చింతయ్య పాల్గొన్నారు.

## మూడో రోజూ కొనసాగిన తపాలా సేవకుల సమ్మె



హనుమాన్ జంక్షన్ పోస్టాఫీసు వద్ద శిబిరంలో నిరసన తెలుపుతున్న గ్రామీణ డాక్ సేవకులు

**హనుమాన్‌జంక్షన్‌రూరల్:** గ్రామీణ తపాలా సేవకుల డిమాండ్ల పరిష్కారానికి చేపట్టిన దేశవ్యాప్త నిరవధిక సమ్మె మూడో రోజుకు చేరింది. ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ పిలుపు మేరకు గురువారం తపాలా కార్మికులు విధులు బహిష్కరించి హనుమాన్‌జంక్షన్ పోస్టాఫీసు ఎదుట ఆందోళనకు దిగారు. అనంతరం పోస్టాఫీసు వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో రోజంతా బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ నాయకులు కేవీఎస్ సత్యనారాయణ, ఎంజే వేదనాయకం, పి.నాగేశ్వరరావు, సీహెచ్ ఈశ్వరరావు, పి.సుభాని ఖాన్, ఎం.విజయకుమార్ పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండ



కలవపాములలో మినుము విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

**ఉయ్యూరు:** పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని కలవపాముల, కాటూరు, కడవకొల్లు గ్రామాల్లో ఎమ్మెల్యే పార్థసారథి పర్యటించి వరి పంట పొలాలను పరిశీలించారు. కలవపాములలో రైతులకు మినుము విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పంటలు పూర్తిగా నష్టపోయామని, అన్ని విధాలా ఆదుకుంటేనే రైతు బతకగలుగుతాడన్నారు. రంగు మారిన ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు అధైర్య పడాల్సిన పనిలేదన్నారు. నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందిస్తామన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులు పెట్టొద్దని అధికారులకు సూచించారు. తేమ, రంగు శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేసి రైతాంగానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పొనుగుమాటి బాలస్వామి, కొడాలి ఆశాజ్యోతి, ఎం.సుధారాణి, పీఏసీఎస్ చైర్మన్ జొన్నలగడ్డ నరేష్ తదితరులు పాల్గొన్నారు. కంకిపాడులో ఈనెల 28న జరగనున్న బస్సుయాత్రను విజయవంతం చేయాలని విజ్ఞప్తిచేశారు.

# శానిటరీ న్యాప్‌కిన్స్ తయారీలో శిక్షణ

**నున్న(విజయవాడరూరల్):** పర్యావరణ పరిరక్షణకు అనువైన శానిటరీ న్యాప్‌కిన్స్ తయారీ శిక్షణ కార్యక్రమం గురువారం నున్న గ్రామంలోని గీతా మందిరంలో జరిగింది. ఇడీఐఐ, యాక్సెంచర్, గైడ్ ఫౌండేషన్ ఫర్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. 15 రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమంలో 50 మంది స్వయం సహాయక గ్రూపుల మహిళలు పాల్గొన్నారు. బనానా ఫైబర్ క్లాత్‌తో శానిటరీ న్యాప్‌కిన్స్ తయారు చేయడం ప్యాకింగ్ చేయడంతో పాటు మార్కెటింగ్ మెలకువలను సంస్థల ప్రతినిధులు తెలియచేశారు. శిక్షణ కాలం పూర్తయిన పిమ్మట మహిళలు న్యాప్‌కిన్స్ తయారు చేసుకుని సొంతంగా వ్యాపారం చేసుకోవడం వలన ఆర్థికంగా పరిపుష్టి సాధించుకోవచ్చునని ఈడీఐఐ ప్రతినిధి కమలేష్ కుమార్ తెలియజేశారు. మార్కెటింగ్ చేసే మెలకువలను ఈ సందర్భంగా తెలియచేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీఎం జి.చంద్రశేఖర్, కొండలరావు, కోఆర్డినేటర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గైడ్ ఫౌండేషన్ ఫర్ డెవలప్‌మెంట్ మురళీకృష్ణ, సురేష్‌బాబు, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

# రంగస్థల నటుడు జైరాజ్‌కు ఘన నివాళి



జైరాజ్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుమ్మడి విజయ్‌కుమార్

**పెనమలూరు:** రంగస్థల నటుడు, నటరత్న, గాన కోకిల, గండపెండేర ధారి గుమ్మడి జైరాజ్ రంగస్థల నటుడిగా సమాజానికి అందించిన సేవలు ఎన్నటికీ మరువలేనివని వైఎస్సార్ సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుమ్మడి విజయ్‌కుమార్ అన్నారు. యనమలకుదురులో గురువారం జైరాజ్ 11వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆటోస్టాండ్ అధ్యక్షుడు సరిహద్దు రాజేష్, మరీదు శ్రీనివాసరావు, గుమ్మడి జీవన్‌కుమార్, గుమ్మడి అన్వేష్, ఏలియా, సాల్మన్‌రాజు, జైదీప్, ఆంతోని, బడుగు మధు, ఆటోడ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, గుమ్మడి కళాపీఠం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇందుపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర

**ఉంగుటూరు:** మండలంలో ఇందుపల్లి, ముక్కపాడు గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో 17 రకాల సంక్షేమ పథకాలను వివరించారు. చేతి వృత్తుల వారికి ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. ఈ పథకంలో చేరేందుకు అర్హత ఉన్నవారు కామన్ సర్వీస్ సెంటర్లలో నమోదు చేసుకోవాలని తెలిపారు. 15రోజులు శిక్షణ అందివడంతో పాటు శిక్షణ సమయంలో రోజుకు రూ.500 అందజేస్తారని చెప్పారు. శిక్షణ అనంతరం రూ.15వేలు విలువ చేసే సామగ్రి అర్హత ప్రకారం రూ.లక్ష రుణం అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ అమీర్ బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం

**ఉయ్యూరు:** సహజ ఇంధన వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం నిర్వహించారు. ఇంధన పొదుపు ఆవశ్యకతను తెలియజేస్తూ ప్లకార్డులతో ర్యాలీ చేశారు. లయన్స్ ప్రతినిధులు ఊర కిషోర్ కుమార్, దినవహి ప్రసాద్, నెల్లి శ్రీనివాస్, విజయసాయి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వేణు శివప్రసాద్ పాల్గొన్నారు.

## చోడవరంలో కౌలు రైతు ఆత్మహత్య



తిరుపతయ్య మృతదేహం

**పెనమలూరు:** చోడవరం గ్రామానికి చెందిన కౌలు రైతు ఒకరు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చోడవరం దళితవాడకు చెందిన చోడవరపు తిరుపతయ్య(50) 5 ఎకరాల పొలం కౌలుకు తీసుకున్నాడు. అతను ఈ ఏడాది వరి సాగు చేశాడు. తుపాను కారణంగా వరి పంట దెబ్బతిందనే దిగులుతో ఈ నెల 10వ తేదీన పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు అతనిని పటమటలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. అతనికి భార్య, దత్తత కుమారుడు ఉన్నారు. పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## సంక్షిప్త వార్తలు

**పొదుపుగా విద్యుత్ వినియోగంపై అవగాహన ర్యాలీ**

**పెనమలూరు:** కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పొదుపుగా విద్యుత్ వినియోగంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జాతీయ శక్తి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా కాలేజీ నుంచి కానూరు వరకు ప్లకార్డులతో ర్యాలీ చేశారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

**ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో..**

గంగూరు ధనేకుల ఇంజజినీరింగ్ కాలేజీలో గురువారం జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవం నిర్వహించారు. బెంగళూరుకు ఎల్ఎస్‌టీకి టెక్నికల్ మేనేజర్ బి.చంద్రశేఖర్ శక్తి సంరక్షణ, పొదుపుపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కడియాల రవి, డీన్ కె.వెంకటరామిరెడ్డి, కోఆర్డినేటర్ అనిల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

**అత్తింటివారిపై వరకట్నం వేధింపుల కేసు నమోదు**

**పెనమలూరు:** వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు పాము వెంకటయ్య వీధిలో ఉంటున్న కౌసర్‌ఖాన్ 2012లో షేక్ ముజీబ్‌గోరిని పెద్దల సమక్షంలో కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త ఉయ్యూరు కేసీపీలో పనిచేస్తాడు. గతంలో ఒకసారి భర్తతో పాటు మామ గోరి, అత్త జుబేదాబేగం అదనపు కట్నం తీసుకురావాలని వేధించడంతో బాధితురాలు 2019లో పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా భర్తకు కౌన్సెలింగ్ చేశారు. ఇటీవల మళ్లీ అదనపు కట్నం తీసుకువస్తేనే కాపురం చేస్తానని వేధించటంతో బాధితురాలు తిరిగి పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

**కానూరులో మరో వరకట్నం వేధింపుల కేసు**

**పెనమలూరు:** వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మహదేవపురం కాలనీకి చెందిన అబ్దుల్ రుబీనా 2021 సంవత్సరం ఫిబ్రవరిలో గుడివాడలో ఉంటున్న ఎండి.యాహియాను పెద్దల సమక్షంలో కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. అయితే రుబీనా కాపురానికి వెళ్లిన కొద్దిరోజులకే అత్త షెహనాజ్ బేగం అనారోగ్యంతో మృతి చెందింది. రుబీనా కాపురానికి వచ్చిన కొద్ది రోజులకే అత్త మరణించిందని అత్తింటివారు రుబీనాను వేధించసాగారు. భర్త యాహియా వ్యసనాలకు బానిసగా మారి భార్య రుబీనా, ఆమె కుటుంబ సభ్యులను దూషించేవాడు. రుబీనాకు కుమారుడు జన్మించాడు. అదనపు కట్నం కావాలని భర్తతో పాటు మామ ఎండీ అయూబ్, బావ మెహీన్, తోటి కోడలు జెహారబి కలిసి రుబీనాను ఈ ఏడాది ఏప్రిల్ లో వేధించి పుట్టింటికి పంపేశారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

**వినీలచంద్రకు పీహెచ్‌డీ ప్రదానం**

**గన్నవరంరూరల్:** ఎస్ఆర్ఎం డీమ్డ్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీని సాధించిన డి.వినీల చంద్రను గురువారం పలువురు అభినందించారు. పట్టణానికి చెందిన ప్రముఖ హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ దొడ్డా సుబ్బారెడ్డి కుమార్తె వినీలచంద్ర సైస్మిక్ డేటా ప్రాసెసింగ్, ఇన్వర్షన్, అండ్ ఇంటరప్షన్ బేస్డ్ ఆన్ డీప్ లెర్నింగ్ మెథడ్స్ అంశంపై డాక్టర్ ఇ.కార్తికేయన్ మార్గదర్శనంలో సమర్పించిన పత్రాలకు ఎస్ఆర్ఎం డీమ్డ్ యూనివర్సిటీ పీహెచ్‌డీని ప్రదానం చేసింది.

**'అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి'**

**కంకిపాడు:** అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఆర్.రఘు విజ్ఞప్తిచేశారు. కంకిపాడులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారంతో మూడో రోజుకు చేరింది. కార్యక్రమంలో నాయకులు యు.త్రిమూర్తులు, టి.నరేష్, బి.రాజేష్, పంతగాని రమేష్, వి.జ్యోతి, ఎం.జోగిరాజు, కనకరత్నం, లక్ష్మీ ప్రసన్న, ఇందిర, విజయలక్ష్మి పాల్గొన్నారు.